# విశిష్ట యోగవాసిష్ఠము

భారతీయ ఆధ్యాత్మిక తత్త్వమును జ్ఞాన సంపదను కరతలా మలకముగా చిన్ని చిన్ని కథల ద్వారా చక్కని ఉపమానములతో దృష్టాంతములతో ఆఖ్యానములతో గొప్ప గొప్ప పారమార్థిక రహస్యములను ప్రస్ఫుటముగా  వివరింపబడిన ఆధ్యాత్మిక రస తరంగ మాలికయే ఈ యోగవాసిష్టము. దీనికి వశిష్ఠ గీత అని కూడా నామాంతరము కలదు. వాల్మీకి మహర్షి ముప్పైరెండువేల శ్లోకములతో లిఖించిన ఈ గ్రంథము మిక్కిలి ఆసక్తికరమై జిజ్ఞాసువులకు చక్కని జ్ఞాన మార్గాన్ని మోక్ష సంపదను అందజేస్తుంది. మోక్ష ప్రాప్తికి వలసిన సమస్త సాధనా సంపత్తిని సువ్యక్తమొనరించుటచే దీనికి మోక్షోపాయము అన్న పేరువచ్చినది. కనుకనే మూల గ్రంథము యొక్క ప్రతి సరిగా చివరను 'ఇతి శ్రీ వశిష్ఠ మహా రామాయణే వాల్మీకీయే మోక్షోపాయే' అను వాక్యంలో ఉల్లేఖించబడినవి. అజ్ఞానాంధ కారమున బడి సంసార తాపత్రయముచే మిగుల పరితపించుచు, దారి తెన్నూ గానని జీవులను,  తత్ ఉప దేశము ద్వారా ఉద్ధరించుచు వారి హృదయ తాపములను చల్లార్చి శాంతి నొసంగునట్టి దివ్య బోధనామృతమే ఈ యోగవాసిష్ఠ గ్రంథ రాజము. ఈ గ్రంథము యొక్క విచారణచే జనులు సంసార సంకటమును లెస్సగా దాటగలరు అను బ్రహ్మ వాక్యములు ఈ అర్ధమునే స్ఫష్టీకరించు చున్నవి.



శ్రీరామచంద్రుడు పదునారు వత్సరముల చిరుత ప్రాయమునందు దృశ్య ప్రపంచము యొక్క అనిత్యతను  ఎరిగి భోగ విలాసములందు పూర్తిగా విరక్తుడై కర్తవ్యము తెలియక విషాద గ్రస్తుడై తూష్ణీస్థితుడై, నిర్లిప్తుడై యున్న సమయమున అతని కులగురువగు శ్రీ వసిష్ఠ మునీంద్రుడు అతనికి ధైర్యోత్సాహములు పురిగొలుపుచు విశ్వామిత్ర మహర్షి ఆదేశానుసారము శ్రీరాముని

కర్తవ్యోన్ముఖునిగా చేసి ఆయన అవతార లక్ష్య దిశగా మళ్లిస్తాడు. ఆ అఖండ పారమార్థిక బోధయే ఈ వసిష్ఠ గీత. ఈ వాసిష్ఠ ఉద్గ్రంథము జనసామాన్యము కంతకును సంసార తరణోపాయముగా విలసిల్లుచున్నది. నిండు సభయందు ఇరువది దినములు వశిష్ట మునీంద్రుని దివ్యోపదేశము కొనసాగినది. అప్పుడు ఆ దశరథుని ఆస్థానమంతయు వాల్మీకాది మహర్షులతోను త్రిలోక సంచారి అయిన నారదుని తోడను, శర్యాతి, ఋచీకుడు మొదలైన వేద వేదాంగ పారంగతులైన మహనీయులతోను నిండిపోయి ఉండెను. ఈ వసిష్ఠ గీత పూర్తి అయిన వెంటనే 'అహో బతః మహత్ పుణ్యం శ్రుతం జ్ఞాతమ్ మునిర్ముఖాత్ ఏవ గంగా సహస్రేణ స్నాతా ఇవ వయం స్థితా' అని వసిష్ఠ మునీంద్రుని పూర్వ విరోధి అయిన విశ్వామిత్రుడు పొంగిపోయి, ఇలా శ్లాఘించాడు. ఆహా ఎంత సంతోషము! మహా పుణ్య స్వరూపమై పవిత్రమైనట్టి జ్ఞానమును ఇప్పుడు వసిష్ఠ మునీంద్రుని ముఖతః వినగలిగితిమి. దానిచే వేలకొలది గంగా నదులందు స్నానము చేసిన చందమున మనము ఇప్పుడు పవిత్రులమైతిమి అని వారందరు ఆనంద పడిపోయారు. అట్లే నారదుడు కూడా ఎటువంటి బోధను ఇంతకుముందు ఏ లోకమందును వినియుండలేదో, అట్టి మహా బోధను విని నా కర్ణద్వయము పవిత్రములైపోయినవి అని వచించాడు. ఇక ఈ గ్రంథమున ప్రస్తావించబడిన విషయములేవో పరిశీలించెదము.

శ్రీరామ చంద్రుడు రాఘవ వైరాగ్య ప్రకరణలో ఈ విధంగా ప్రస్తావిస్తాడు. 'ఆయుః పల్లవ కోణాగ్ర లాంబాంబు క్షణభంగురం ఉన్మత్త మివ సంతద్య యాత్య కాండే శరీరకం' అనగా ఆయువు చిగుళ్ల చివరల వ్రేలాడు జలబిందువు వలె క్షణ భంగురమైనది. అది పిచ్చి వానివలె అకాలముననే ఈ శరీరమును విడిచి పోవుచున్నది. అట్లే 'ప్రాజ్ఞ శూరా .... అన్న శ్లోకంలో ఈ విధంగా అంటాడు. ధూళి రత్నములను మలినమొనర్చునట్లు గొప్ప ప్రజ్ఞా వంతులను శూరులను కృతజ్ఞులను సర్వుల యెడ ప్రీతి కలవారిని కోమల స్వభావులను కూడా లక్ష్మి (సంపదలు, ధనము) మలినమొనర్చుచున్నది. అట్లే 'దోషై జర్జరతాం ... అన్న శ్లోకములో మనస్సు సత్కార్యములను, మహాత్ముల సేవలను విడిచి కామాది దోషములను ఆశ్రయించి శక్తిని కోల్పోవుచున్నది. మరియు నెమలిపింఛపు తుది కొన గాలిలో నూగులాడుచున్నట్లు చంచలమై చలించు చున్నది. ఇట్లు నిరాసక్తుడై యున్న శ్రీరామచంద్రుని ఏ విధముగా తన బోధతో వసిష్ఠుడు మేల్కొలిపినాడో ఈ శ్లోకములలో పరిశీలించెదము. 'సంతోష సాధు సంగశ్చ విచారో ..... అన్న శ్లోకంలో

సంతుష్టి, సాధుజన సాంగత్యము, విచారణ, శమము, ఈ నాలుగే సంసార సముద్రమును దాటుటకు మనుజులకు ఉపాయములై యున్నవి అని వచించారు. అట్లే పురుష ప్రయత్నము యొక్క ఆవశ్యకతను ఈ క్రింది శ్లోకములో వివరించారు.

పురుష ప్రయత్న జనేన మనోవనే - శుభ తటాను గతాన్ క్రమశః కురు
వరమతే నిజభావ మహానదీ -మహా హతేన మనాగపినోహ్యసే

అనగా శ్రేష్ఠ బుద్ధి గల రామచంద్రా! ప్రబల పురుష ప్రయత్న వేగముచే మనసు అను వనమందలి ఈ నిజ వాసనారూప నదిని క్రమముగా శుభ ప్రవాహమువైపునకే మరలింపుము. అట్లు చేయుటచే నీవు అశుభ ప్రవాహముచే ఒకింతయైనను కొట్టుకొని పోబడవు.
'క్షపితా నఖిలా లోకాం దుఃఖః క్రకాచా దారితాం ...' అన్న శ్లోకములో ఆకాశమున నున్న సూర్య భగవానుడు క్రింద నున్నట్టి వన వృక్షాదులను చూచుచున్నట్లు జ్ఞాని క్షయమును బొందినట్టిదియు, దుఃఖమను అంపముచే కోయబడినట్టిదియు అగు లోకులనందరితో కూడిన ప్రపంచమును చూచుచుండును. 'బద్ధోహి వాసనా బద్ధో ...' అన్న మరో శ్లోకంలో వాసనలచే బంధింపబడినవాడే బద్ధుడు. వాసనా క్షయమే మోక్షము. కావున వాసనలను పరిత్యజించి మోక్షమును గురించిన కోరికలను త్యజించి వేయవలెనని బోధిస్తాడు. వాసనలను పరిత్యజించి ఆత్మస్తుడైన వానికి కోరనవసరము లేకనే మోక్షము లభించునని భావన. ఇవన్నియు చెప్పి ఒక చోట మోక్షమంటే ఏమిటో అందరికి సులభముగా అర్ధమయ్యే రీతిలో వేరెచటను వచింపని విధములో బోధిస్తాడు.

'నమోక్షో నభసః పృష్టే న పాతాలే న భూతలే
మోక్షోహి చేతో విమలం సమ్యక్ జ్ఞానవిబోధితం'

అనగా మోక్షమనగా ఆకాశమున వెనక భాగమునగాని (ఊర్ధ్వ లోకములలో) పాతాళమున గాని (అథోలోకములలో) భూతలమున గాని లేదు. ఉత్తమ జ్ఞానముచే లెస్సగా బోధితమైనట్టి నిర్మల చిత్తమే మోక్షము అని భావము.

వసిష్ఠ గీతలో భగవద్గీత

యోగవాసిష్ఠములో అర్జునోపాఖ్యానములో రాబోవు ద్వాపర యుగములో శ్రీకృష్ణ భగవానునిచే బోధింపబడిన భగవద్గీత ను గూర్చి గూడా ప్రస్తావిస్తారు వసిష్ఠ మహర్షి. ఇది వారి భవిష్య దర్శనమునకు, త్రికాల జ్ఞానమునకు, సాక్షీ భూతంగా నిలుస్తోంది. దీనివలన ఆ మహర్షి యొక్క తపో మహిమ ఈశ్వరీయ శక్తి వ్యక్తములగుచున్నవి. ఈ రెండు గ్రంథములందును సందర్భములు వేరైనా, లక్ష్యమొకటిగా నిలిచి చింతాగ్రస్తులై వైక్లబ్య మనస్కులైన శ్రీరామచంద్ర, అర్జునులను కార్యోన్ముఖులను గావించుటలో జగద్గురువులైన వసిష్ఠ శ్రీకృష్ణుల కృషి అపారం లోకవంద్యమునై అలరారుచున్నవి. భగవద్గీతలోని కొన్ని శ్లోకములు ఈ వసిష్ఠ గీత యందు యథాతథముగా చెప్పబడినవి. కానీ కొన్ని శ్లోకములలో పాదములు మారినవి. ఉదాహరణకు భగవద్గీతలో రెండవ అధ్యాయము నలభై ఎనిమిదవ శ్లోకములో రెండవ పాదము సిద్ధ సిద్ధ్యో సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే' అని ఉంటే, యోగ వాసిష్టంలో రెండవ పాదం నిస్సంగస్త్వం యథాప్రాప్త కర్మవాన్ ననిబధ్యసే అని ఉంటుంది.

ఇట్లు అద్భుతమైన జ్ఞాన మార్గమును ఉపదేశించిన ఈ గ్రంథములో జ్ఞాన మార్గమే మోక్షసాధనకు ఉపకరించునని నిర్ద్వంద్వముగా ప్రకటిస్తారు వసిష్ఠ మునీంద్రులు. అపారమైన ఈ మహా జ్ఞాన సాగరాన్ని ఈ చిన్ని వ్యాసపు పిడికిటిలో ఇముడ్చుట అసాధ్యమైనప్పటికీ పాఠకులను ఈ గ్రంథ పఠనాసక్తులను చేయు ఉద్దేశ్యంతో ఈ ప్రయత్నం చేశాను. శ్రీ కాళహస్తి శుక బ్రహ్మాశ్రమము వారి శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వాములవారిచే విరచితమైన యోగవాసిష్ఠ రత్నాకరం నాలుగు వేల శ్లోకములకు కుదింపబడి చక్కటి సులభ శైలిలో రచింపబడిన గ్రంథరాజము. సర్వులకు అవశ్యము పఠనీయ గ్రంథము.



**రాజ్యలక్ష్మి శ్రీనివాస్ బొడ్డుపల్లి** – సదాచార సంపన్నులు,సంప్రదాయం కల సుబ్బయ్య, సీత దంపతుల కుమార్తె. చిన్నతనం నుంచి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి, ఛందోలు రాఘవ నారాయణ శాస్త్రి, శ్రీ రామ శరణు లాంటి చాలా మంది మహాత్ములను చూస్తూ, సేవ చేస్తూ పెరిగారు. తాను చేసే ప్రతిపని తన గురు కృప, అనుగ్రహం కోసం మాత్రమే అని చెప్పే వినయ శీలి. మహాత్ముల పరిచయం శీర్షిక లో అనేక మంది (250) మహాత్ములను పరిచయం చేశారు.మొత్తం 250 కి పైగా (ఇది రాసేటప్పుడు) దత్త స్తోత్రలు తెలుగు అనువాదం చేశారు. ఇప్పటికే 100 కి పైగా దత్త క్షేత్రాలు,వివరాలు రాసారు. అందరికి దత్తాత్రేయ తత్వం అందుబాటులోకి తెచ్చి,ఈ సారి సంపూర్ణ దత్త అవతారం మన తెలుగు వారికి లభించాలి అని వారి కోరిక. (మొ): 93256 09857 పూణే